కవరు కట్టిన ఫలం

- రూ.90 వేలు పలికిన నీలం మామిడి
- మామిడికి కవర్ కడితే మంచి నాణ్యత
- ఈ నెలాఖరులో టన్ను రూ.లక్ష దాటనున్న ధైనం

పలమనేరు: నియోజకవర్గంలో వేరుశనగ తర్వాత ఎక్కువ మంది రైతులకు ఆదాయం వచ్చే పంట మామిడి. ఈ మామిడి తోటల్లో కాయలకు కవర్లను కట్టే విధానం గతంలో లేదు. గత నాలుగైదు సంవత్సరాలుగా ఉద్యానవన శాఖాధికారులు అవగాహన కల్పించడంతో రైతులు ఈ విధానాన్ని అవలంబిస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో తోతాపురి మామిడి సీజన్ పూర్తయింది. ప్రస్తుతం నీలం మామిడి మాత్రమే పక్వానికి చేరింది. దీంతో రైతులం దరూ కోతలు పూర్తి చేసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇది కూడా ఆగస్టు తొలివారానికి దాదాపుగా ముగిసిపోతుంది. ఈ నేపథ్యంలో కవరు కట్టిన నీలం మామిడి కాయలు మంచి ధరలు


కవరు కట్టిన నాణ్యమైన మామిడి కాయలు


కవరు కట్టడంతో కాసిన నాణ్యమైన మామిడి

పలుకుతున్నారు. పలమనేరు, బంగారుపాళెం మార్కెట్లలో శనివారం టన్ను ధర రూ.90వేలను దాటింది. ఇదే సీజన్‌లో గత 2022లో టన్ను రూ.1.30 లక్షలు, 2023లో రూ.1.20లక్షలు అమ్ముడుపోయిన విషయం తెలిసిందే. ఇంకా సీజన్ 15 రోజులపాటు ఉంటుంది కాబట్టి ఈ సమయంలో టన్ను ధర లక్ష రూపాయలు దాటడం ఖాయమని మామిడి వ్యాపారులు చెబుతున్నారు. ఏదేమైనా కవర్లను కట్టడం ద్వారా నాణ్యమైన కాయలు వచ్చి ధరల పెరుగుదలకు కారణమైంది.

కవరు కడితే ఎన్నో లాభాలు

సాధరణంగా మామిడి కాయలు కోతకొచ్చే రెండు నెలల ముందు ఈ కవర్లను కట్టుకోవాల్సి ఉంటుంది. దీంతో కాయలపై సూర్యరశ్మి పడకుండా, ఎలాంటి క్రిమికీటకాలు సోకకుండా కాయలు నాణ్యంగా ఉంటాయి. దీంతోపాటు కాయల సైజు బాగా పెరుగుతాయి. వీటిని ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు అవకాశం ఉంటుంది. కాబట్టి వ్యాపారులు సైతం అధిక ధరలకు కొనేందుకు ముందుకు వస్తారు.


నీలం మామిడి చెట్టులోని కాయలకు కట్టిన రక్షణ కవర్లు

వంద కవర్లు రూ.400లోపే

ఈ కవర్లు స్థానికంగానే కాకుండా ఇండియా మార్ట్, అమేజాన్‌లాంటి షాపింగ్ సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లోనూ పొందవచ్చు. వందకవర్లు(17కి20 సెంటీమీటర్లు) ధర రూ.400లోపే ఉంటుంది. మామిడితోట కాపును బట్టి కాయలను అంచనా వేసి ఎన్ని కావాల్లో అన్ని కొని కాయలకు తొడుగులుగా వాడుకోవచ్చు. వీటిని మ్యాంగో ప్రొటెక్షన్ గ్రోత్ పేపర్ కవర్స్‌గా పిలుస్తారు.

కవర్లు కట్టిన రైతులకు పండగే

మామిడి సీజన్ ముగుస్తున్న దశలో మార్కెట్‌కు వచ్చే నీలం మామిడికి ఏటా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నియోజకవర్గంలో దాదాపు 20వేల హెక్టార్లలో మామిడి తోటలుండగా ఇందులో 20 శాతం మాత్రమే నీలం మామిడి సాగవుతోంది. ఇది మామిడిలో ఆఖర్‌సీజన్ ఫ్రూట్‌గా పేరుంది. ఇక్కడి రైతులు సహజ పద్ధతుల్లో మామిడిని సాగుచేయడమే కాకుండా కాయలకు కవర్లను కట్టడంతో సరుకు నాణ్యంగా ఉంటోంది. దీంతో వ్యాపారులు పోటీపడి అధిక ధరకు కొంటుండడంతో ధరలు ఆశాజనంగా మారాయి. ఫలితంగా ఇక్కడి నీలం మామిడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కవర్లను కట్టేలా ప్రోత్సహిస్తున్నాం



"పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో మామిడి రైతులకు కవర్లను కట్టడంపై అవగాహన కల్పిస్తున్నాం. మామిడి సాగు చేస్తున్న రైతులకు ఏటా సమావేశాలను నిర్వహించి కవర్లను కట్టడం ద్వారా కలిగే మేలును వివరిస్తున్నాం. ఇప్పటికే ఇక్కడి రైతులు 30 శాతం దాకా తోటల్లో కాయలకు కవర్లను కడుతున్నారు. వచ్చే సీజన్‌లో 50 శాతంమంది ఈ విధానాన్ని పాటించే లక్ష్యంతో ముందుకెళుతున్నాం.

– డా.కోటేశ్వర్రావ్, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు

సచివాలయాల్లో కానరాని సమయపాలన

వి.కోట: మండలంలో ఉదయం 10 గంటలకు తెరుచుకోవలసిన సచివాలయాలు 10.30 గంటలకైనా తెరచుకోక పోవడంతో ప్రజలు సచివాలయాల ముందు పడిగాపులు కాస్తున్నారు. అధికారులకు సమయం అంటూ లేదా? వారిని ఎవరూ అడగరా? మేము ఎంత సేపిలా నిరీక్షించాలి అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అంతేకాక మండలంలో పలు సచివాలయాల్లో ఎప్పుడు వెళ్లినా సిబ్బంది నామమాత్రంగానే ఉంటారు. ఒక్కో కార్యాలయంలో ఒకరూ లేక ఇద్దరే ఉంటారు. మిగతా సిబ్బంది ఫీల్డ్‌పై వెళ్లారంటూ చెబుతున్నారు. మండలంలోని పత్రపల్లి సచివాలయం శనివారం ఉదయం 10:30 గంటలైనా తెరచుకోకపోవడంతో ప్రజలు వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.


సచివాలయం ముందు నిరీక్షిస్తున్న ప్రజలు

క్లుప్తంగా

విద్యార్థినికి సత్కారం


వర్షిణికి సర్టిఫికెట్ అందిస్తున్న ఉపాధ్యాయులు

కుప్పం రూరల్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన కుప్పం మండలం టి.సడుమూరు విద్యార్థి వర్షిణిని శనివారం పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు సత్కరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్‌కు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వర్షిణి ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థి వర్షిణిని సత్కరించారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పద్మనాభరాజు మాట్లాడుతూ వర్షిణికి ఈ ఉపకారం వేతనం ద్వారా నాలుగు సంవత్సరాలపాటు ప్రతి నెలా వెయ్యి రూపాయల చొప్పున నగదు అందనున్నట్లు తెలిపారు.

తిరువణ్ణామలైకు బస్సులు నడపండి

కుప్పం రూరల్: ప్రతి నెలా తమిళ పౌర్ణమి రోజు తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణకు కుప్పం నుంచి వందలాది భక్తులు వెళ్తుంటారని, అదనపు బస్సు సర్వీసులు నడపాలని భక్తులు కోరుతున్నారు. పౌర్ణమి రోజు కుప్పం డిపో నుంచి రెండు బస్సు సర్వీసులు నడుస్తుండగా, అవి ఏమాత్రం సరిపోవడం లేదని భక్తులు అంటున్నారు. బస్సులు లేకపోవడంతో కుప్పం నుంచి తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు, కృష్ణగిరికి వెళ్లి బస్సులు ఎక్కాల్సి వస్తోందని అంటున్నారు. ఆర్టీసీ అధికారులను బస్సు సర్వీసు కోరితే ఉన్నతాధికారులను ఆశ్రయించాలని నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారని భక్తులు వాపోయారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ప్రతి నెలా తమిళ పౌర్ణమి రోజు అదనపు బస్సు సర్వీసులు నడపాలని భక్తులు కోరుతున్నారు.

వయోజన టీకాతో ప్రయోజనం


వ్యాక్సినేషన్‌లో ఆరోగ్య సిబ్బంది

రొంపిచర్ల: మండలంలోని 60 ఏళ్ల పైబడిన వారు తప్పనిసరిగా బీసీజీ టీకా తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ సూచించారు. శనివారం ఈ మేరకు ఆయన మాట్లాడుతూ టీకా ప్రయోజనాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. టీబీ బారిన పడకుండా టీకా నిరోధిస్తుందని వెల్లడించారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు సుమారు 2,600 మందికి టీకా వేసినట్టు వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, లక్ష్మీపతి, వేంకటేశ్వర, గీతశ్రీ, పారిజాతం, లత పాల్గొన్నారు.

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రంజిత్


రంజిత్‌ను అభినందిస్తున్న క్రీడాకారులు

పలమనేరు: పలమనేరులో జరుగుతున్న లెదర్‌బాల్ 20–20 క్రికెట్ టోర్నమెంట్‌లో శనివారం ఓ అద్భుతం చోటుచేసుకుంది. లోకల్ బాయ్స్, వారియర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో లోకల్ బాయ్స్ జట్టు విజయం సాధించింది. ఈ జట్టులోని బౌలర్ రంజిత్ నాలుగు ఓవర్లు బౌలింగ్‌చేసి ప్రత్యర్థి జట్టులోని ఎనిమిది మందిని ఔట్ చేశాడు. ఇతని స్కోర్ 4–24–8గా నమోదైంది. దీంతో అతనికి మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్ అవార్డు దక్కింది. ఇరు జట్ల సభ్యులు రంజిత్‌ను అభినందించారు.

కొమ్మలు కత్తిరించాలి


మాట్లాడుతున్న డీడీ మధుసూదన్‌రెడ్డి

పూతలపట్టు: మండలంలోని తిమ్మిరెడ్డిపల్లెలో శనివారం మామిడి రైతులకు కోత అనంతరం చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై జిలా ఉద్యానవనశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కాయలు కోసిన వెంటనే కొమ్మల కత్తిరింపులు చేపట్టాలని తెలిపారు. కొమ్మల కత్తిరింపుల ఆవశ్యకతను వివరించారు. రైతులు కొమ్మలు కత్తిరించిన వెంటనే ఎరువులు వేసి నీటి తడులను ఇవ్వాలని సూచించారు. పచ్చిరొట్ట పైరు ఇప్పుడు వేసి, సెప్టెంబర్, అక్టోబర్‌లో పూత వచ్చినప్పుడు దున్నుకోవడం వల్ల సూక్ష్మ పోషకాలు మామిడి చెట్లకు అంది, పూత బాగా వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవనాధికారి వింధ్య, రైతులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న ప్రపంచ మామిడి దినోత్సవ సదస్సును విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మామిడి మార్కెట్ ఆవరణలో ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభం అవుతుందన్నారు. పెద్ద సంఖ్యలో మామిడి రైతులు పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

పెద్దపంజాణి: మండలంలోని ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప చెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం పెద్దపంజాణి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలన్నారు. వర్షాకాలంలో తాగునీరు కలుషిత కారణంగా డయేరియా విజృంభించే అవకాశం ఉన్నందున తాగినీటి ట్యాంకులు క్లోరినేషన్ చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా మురుగునీటి గుంతల్లో, కాలువల్లో, బ్లీచింగ్ చల్లించాలని తెలిపారు. అనంతరం ఎంపీపీ శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. వ్యవసాయాధికారి రభీబా మాట్లాడుతూ మండలంలో 9,246 మంది రైతులకు పీఎం కిసాన్ నగదు వారి వ్యక్తిగత ఖాతాల్లో జమైందని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 900 ఎకరాల్లో వేరుశనగ, 30 ఎకరాలలో వరి సాగైనట్లు పేర్కొన్నారు. హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మండలానికి 1,717 ఇళ్లు మంజూరు కాగా అందులో 1,182 పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన వాటిని లబ్ధిదారులు డిసెంబరులోపు పూర్తి చేసుకోవాలన్నారు. సామాజిక పింఛన్ల పంపిణీ సక్రమంగా జరగలేదని, సచివాలయాలపై అధికార పార్టీ బ్యానర్లు ఏర్పాటు చేశారని, సర్పంచ్‌ల సీట్లలో ఇతరులు కూర్చుంటున్నారని సమావేశంలో వైస్ ఎంపీపీ జీడీ బాబు, ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్ దృష్టికి తీసుకువచ్చారు. విచారించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. తదుపరి పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, వైద్యాధికారులు మురళి, నందిని, ఏపీఎం క్రిష్ణప్ప, ఏపీఓ చిన్న రెడ్డెమ్మ, ఎంఈఓలు గోపాల్ రెడ్డి, తులసీరామ్ తమ శాఖల ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో డీటీ ఫణికుమార్, మండల కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు హరినాథ్, పలువురు ప్రజా ప్రతినిధులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెప్ప

గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌ను తెలపండి

వి.కోట: ప్రస్తుతం ఆడపిల్లలపై అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి తల్లీ బిడ్డకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్ గురించి తెలియపరచాలని మహిళా పోలీస్ మహేశ్వరి తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆమె మహిళలకు రాష్ట్రంలో రోజురోజుకూ పెరిగిపోతున్న అఘాయిత్యాలు, సైబర్ నేరగాళ్ల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో ఎలా ఉండాలన్నది, ఆడపిల్లలకే కాక, మగ పిల్లలకు కూడా ఆడవాళ్లు, ఆడపిల్లల పట్ల ప్రవర్తించాల్సిన విషయాలపై తల్లి వివరించాలన్నారు. ముఖ్యంగా పిల్లలకు మొబైల్‌ఫోన్లు ఇవ్వడం ద్వారా వారు పూర్తి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. దీంతోపాటు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.


అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్ మహేశ్వరి

తక్కువ వడ్డీకే పంట రుణాలు

చౌడేపల్లె : జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో తక్కువ వడ్డీకే బంగారు, వ్యవసాయ పంట రుణాలిస్తున్నట్లు బ్యాంకు మేనేజరు వెంకటేష్ బాబు తెలిపారు. శనివారం వెలుగు కార్యాలయంలో ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం సభ్యులతో సైబర్‌క్రైమ్, బ్యాంకు లావాదేవీల్లో మోసాలను గుర్తించేలా సదస్సు నిర్వహించారు.మ్యాజిక్ షో, పాటల ద్వారా ప్రజలకు చైతన్యపరిచారు. మేనేజర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన , సురక్ష బీమా యోజన , అటల్ పెన్షన్ యోజన, డిజిటల్ లావాదేవీలను వివరించారు. సమావేశంలో గిరివాణి, రోహిత్, అక్రమ్ బాషా, విజయ్, చిరంజీవి, వెంకటేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ వెంకటేష్

నేడు గురుపౌర్ణమి వేడుకలు

సదుం: స్థానిక గాంధీరోడ్డులోని సాయిమందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం కాగడ హారతి, పాలాభిషేకం, సాయిభజన, మధ్యాహ్న హారతి, ధూప్ హారతి, శేజ్ హారతి కార్యక్రమాలు జరిపించనున్నట్లు వివరించారు. అలాగే భక్తులకు అన్నదానం చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సదుం: జిల్లా సహకార బ్యాంకు సదుం బ్రాంచ్‌లో ఆర్థిక అక్షరాస్యతపై శనివారం కళాజాత నిర్వహించారు. బ్యాంకులో తక్కువ వడ్డీకి బంగారు, వ్యవసాయ రుణాలు, పీఎం జీవన జ్యోతి బీమా యోజన, డిజిటల్ లావాదేవీలపై ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ ద్వారా పాటలు, కథనాలు, మ్యాజిక్‌షో ద్వారా అవగాహన కల్పించారు. మేనేజర్ విజయకుమారి, శివప్రియ, సూపర్‌వైజర్ శేఖరయ్య, కళాజాత బృందం విజయ్, చిరంజీవి, వెంకటేష్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ చంద్రుని దినోత్సవం


డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వెంకటేశులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ చంద్రుని దినోత్సవాన్ని ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు మాట్లాడుతూ చంద్రునిపై మనిషి పాదం మోపిన రోజును చంద్రుని దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భవిష్యత్తుల్లో చంద్రునిపై మనం చేసే ప్రయోగాలు భవిష్యత్తులో మానవాళికి ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. ఇందులో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకగా తిరునాళ్ల నిర్వహణకు చర్యలు

చౌడేపల్లె : రాజనాలబండలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఏటా శ్రావణమాసంలో నిర్వహించే తిరునాళ్లను వేడుకగా జరిపించేందుకు చర్యలు చేపడుతున్నట్లు టీటీడీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఈ మేరకు ఆయన ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలతో సమావేశమయ్యారు. తిరునాళ్ల సందర్భంగా చేపట్టే కార్యక్రమాలు, సేవలు, ఖర్చుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది కూడా తిరునాళ్ల, ఉట్లోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో టెంపుల్ ఇన్‌చార్జి భానుప్రకాష్, అర్చకుడు కృష్ణమూర్తి, గ్రామస్తులు వెంకటరెడ్డి, శ్రీనివాసులు, సురేంద్ర పాల్గొన్నారు.


టీటీడీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న అర్చకులు

నంబర్ ప్లేట్ లేని బైక్‌లు సీజ్

వి.కోట: మండలంలో నంబర్ ప్లేట్ లేని బైక్‌లను సీజ్ చేస్తున్నామని, ఇందులో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్‌ఐ బాబు పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద శనివారం ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు నంబర్ ప్లేట్ లేని పలు బైక్‌లను సీజ్ చేసినట్లు వివరించారు. ఆయన మాట్లాడుతూ బైక్‌లకు నంబర్ ప్లేట్ లేని వారు విధిగా నంబర్ ప్లేట్‌ను అమర్చుకొని నంబర్ స్పష్టంగా కనబడేలాగా ప్లేట్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలంలో ఎవరైనా బైక్‌లకు నంబర్ ప్లేట్ లేని పక్షంలో వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు. అలాంటి బైక్‌లను వెంటనే సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ద్విచక్ర హహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ బాబు, సిబ్బంది

జిప్సం వాడకంపై అవగాహన

రొంపిచెర్ల: స్థానిక రైతు సేవా కేంద్రం–2 పరిధిలో వేరుశనగ పంటలో జిప్సం వాడకం, ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించినట్టు ఏఓ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పంట విత్తడానికి ముందు దుక్కిలో ఎకరానికి 200 కేజీల జిప్సం వేయాలని చెప్పారు. పూత సమయంలో కలుపు తీసే ముందుగా 200 కేజీల జిప్సం వేయాలని, కలుపు తీసేటపుడు మట్టిని మొక్క మొదళ్లకు ఎగదోయాలని సూచించారు. జిప్సంలోని కాల్షియం, సల్ఫర్ గింజ గట్టిపడడానికి, నూనె శాతం పెంపొందించేందుకు దోహద పడుతాయని వివరించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది వెంకటరమణ నాయక్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ఆరీఫా షేక్

కుప్పం రూరల్: రోడ్డుపై వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు తప్పక పాటించాలని కుప్పం జూనియర్ సివిల్ జడ్జి ఆరీఫా షేక్ అన్నారు. శనివారం పట్టణంలోని ఐఆర్ఎం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అతిథులుగా హాజరైన జూనియర్ సివిల్ జడ్జి ఆరీఫా షేక్, అర్బన్ సీఐ జీటీ నాయుడులు మాట్లాడుతూ వాహనదారులు తప్పక డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. వాహనాలు తగు కండీషన్‌లో ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని, మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దయానిధి, ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

గడ్డిలో కత్తెర పురుగుపై అవగాహన


వి.కోట: సాగుచేసిన గడ్డిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు


బైరెడ్డిపల్లె: గడ్డిని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

బైరెడ్డిపల్లి : పశువులకు మేతగా వేసే పచ్చి గడ్డిలో కత్తెర పురుగు లార్వాలను గుర్తించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త రెడ్డిరాము సూచించారు. మండలంలోని కమ్మనపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో శనివారం సాగు చేసిన నేపియర్ గడ్డిని జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. వారు మాట్లాడుతూ కత్తెర పురుగు రెక్క పురుగులను ఆకర్షించడానికి వీలుగా 4 లింగాకర్షక బుట్టలను ఎకరాకు అమర్చుకోవడం, గుడ్ల సముదాయాలు పిల్ల పురుగులను ఏరి నాశనం చేయడం వంటివి చేయాలన్నారు. పంటలో జీవ సంబంధ కీటక నాశినులు అనగా 1500 పీపీఎం వేపనూనె 5 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ మందును వాడిన వారం రోజుల వరకూ ఈ గడ్డిని పశువులకు మేతగా వేయకుడదని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు దేవకీ, మోహన్, పాండురంగ, మండల వ్యవసాయ అధికారులు, రైతు భరోసా కేంద్ర అధికారులు పాల్గొన్నారు.

లార్వాలను గుర్తించండి

వి.కోట: పశువులకు మేతగా వేసే పచ్చి గడ్డిలో కత్తెర పురుగు లార్వాలను గుర్తించి వెంటనే తగు చర్యలు తీసుకోవడంతో వాటిని నియంత్రించవచ్చని జిల్లా వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త రెడ్డిరాము సూచించారు. మండలంలోని పడిగల కుప్పం రైతు భరోసా కేంద్రం పరిధిలో సాగు చేసిన నేపియర్ గడ్డిని జిల్లా వ్యవసాయ సలహా, తిరుపతి శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కత్తెర పురుగు రెక్క పురుగులను ఆకర్షించడానికి వీలుగా 4 లింగాకర్షక బుట్టలను ఎకరాకు అమర్చుకోవడం, గుడ్ల సముదాయాలు పిల్ల పురుగులను ఏరి నాశనం చేయడం వంటివి చేయాలన్నారు. పంటలో జీవ సంబంధ కీటక నాశినులు అనగా 1500 పీపీఎం వేపనూనె 5 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ మందును వాడిన వారం రోజుల వరకూ ఈ గడ్డిని పశువులకు మేతగా వేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు దేవకీ, మోహన్, పాండురంగ, మండల వ్యవసాయ అధికారిణి రాజ్యలక్ష్మి, రైతు భరోసా కేంద్ర అధికారులు మధు, చైతన్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే వైద్య సేవలు

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి ముంగిటకే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని కట్టకిందపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 80 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది